# కన్యాశ్రీమం

బాల్యమిత్రుడు రాజేశ్వరరావు ఆగమనం.

రమణారావు కెంతో ఆనందం కలిగించింది. ఉభయులు కుశల ప్రశ్నలైన తరువాత కాఫీ టిఫిన్ తీసుకొని కాసేపు అట్లా షికారువెళ్లి వద్దామనుకుంటూ ఉండగా రమణారావు కుమారుడు శ్యాం వక్కపొడి డబ్బా చేతిలో పట్టుకొని 'ఇదో నాన్నా అమ్మ యిచ్చింద'ంటూ తండ్రికివ్వ వచ్చాడు. నాకు గాదు మామయ్యకివ్వు అన్నాడు రమణారావు రాజును చూపిస్తూ. శ్యాం కొత్త మామయ్యను చూచి సిగ్గుపడి ఓర చూపులు చూస్తూ అట్లాగే నిలబడి పోయినాడు. రాజేశ్వర రావు శ్యాంను దగ్గరకు తీసుకొని ముద్దాడుతూ 'బాబూ' నీ పేరేమిటిరా? అన్నాడు వక్కపొడితీసి నోట్లో వేసుకుంటూ. 'చ్యాము' అన్నాడు బాబు.

'మీా నాన్న పేరో ?'

'నమనానావు.'

మీా అమ్మ పేరు ?.

'మాౘతి.'

మాతతి ఏమిటి బాగాచెప్పు. ? అన్నాడు. రాజు. మాలతి అని చెప్పుబాబు అన్నాడు రమణారావు.

'ఇదేమిట్రా! మామయ్య కూతురు పేరు జానకి కాబోలునే ? అన్నాడు రాజు. ఏదో స్ఫురణకు వచ్చినట్లయి.

'అవును' అంటూనే రమణారావు కూర్చున్నావేమిరా అవిగో! సబ్బు, నీళ్లు లేచి ముఖం కడుక్కొని డ్రెస్ చేసుకో. కాసేపట్లా అట్లా షికారు వెళ్ళివద్దా మన్నాడు. రాజు వెంటనే లేచి ముఖం కడుక్కొని తలదువ్వుకొని దుస్తులు వేసుకొని షికారుకు సిద్ధమైనాడు. ఇంతలో రమణారావు గూడా డ్రెస్ చేసుకున్నాడు. అమ్మను తలుపు వేసుకోమని చెప్పు అని బాబును లోపలికి పంపించి తలుపు దగ్గరకు లాగి రమణారావు రాజుతో కూడా షికారుకు బయలు దేరాడు. త్రోవలో ఎక్కువ మాట్లాడుకోకుండానే స్టేషన్ సమీపంగా రైలుకట్ట ప్రక్కనున్న తెల్లని యిసుక తిప్పల వద్దకు చేరుకున్నారు మిత్రులిద్దరు సూర్యుడు పశ్చిమాంబుధిలో క్రుంకబోతూ సంధ్యారుణ కాంతులతో లోకానికి వింతశోభ కలిగిస్తూ ఉన్నాడు. దక్షిణ దిశనుండి వచ్చే చల్లని పిల్ల తెమ్మెరలు దేహానికి, మనస్సుకుగూడా హాయిని ఇస్తూఉన్నవి. రమణీయమైన ఆ సంధ్యా సమయంలో మూడు సంవత్సరాలకు పిమ్మట కలుసుకున్న ఆ మిత్రులుభయులు పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకోవడం మొదలు పెట్టారు. మాలతిపేరు విన్నప్పటి నుంచి జానకిని వీడెందుకు చేసుకోలేదో అని జిజ్ఞాసతో ఉన్న రాజు 'అయితే నీవు మీ మామయ్య కూతుర్ని పెండ్లి చేసుకో లేదా ఏమిట్రా! ఆ అమ్మాయి పేరు జానకి గాబోలునే' అన్నాడు. మళ్ళీ.

'చేసుకోలేదు' అన్నాడు. రమణారావు సిగ్గుతో విచారంతో తల వంచుకొని.

'పాపము మీ మామయ్య నిన్ను చిన్నప్పటినుంచి తన వద్దనే ఉంచుకొని చదువు చెప్పించాడుగా.

'అవును ఆయన ఉన్నన్నాళ్ళు ఆయన సొమ్ము బాగానే తిన్నాము'

'అయితే మీ మామయ్య' అని సంకోచంతో చూచాడు.

'మా మామయ్య పోయి నాలుగేండ్లయింది'

'పాపము కుమార్తె వివాహం చేయకుండానే ?'

'ఆ ! అకస్మాత్తుగా పోయినాడు'

'మరి జానకి వివాహం ఇప్పుడైందా'

'అయింది'

'మంచి సంబంధమేనా ?'

'ఏ సంబంధ మయితేనేం. అంతా ఐపోయిందిగా'

'అయిపోవడ మేమిటి రమణా ! నీ మాటలన్నీ ఆశ్చర్యంగా ఉన్నాయి'

'అవును. ఆయనిప్పుడు లేదు'

'అయ్యో యెంత చక్కనిపిల్ల ! ఎంత చదువుకున్నది ! ఎంత మంచిది ! నీవు వివాహం చేసుకున్నట్లయితే ఇంత

కష్టం సంభవించక పొయ్యేదేమో! నీవు జానకిని చాలా అన్యాయం చేశావు. మీ మామయ్య నిన్ను పెంచిన పెంచడానికి నీకు చేసిన ఉపకారానికి నీవు జానకిని కాదనవలసింది గాదు'

'ఒరే! పాశ్చాత్యదేశాల్లో మూడు ఏళ్ళు ఉన్నందుకు అక్కడి నడవళ్లు నేర్చుకొని మన కుటుంబ వ్యవస్థ, మన ఆచారాలు మర్యాదలు మరచి పోయినట్లున్నావు'

'నేను జానకిని కాదనలేదు. కావలెనని పోరాడిపోరాడి విఫలుడనైనాను' అంటూ ఉండగా రమణారావు కంఠము దుఃఖంతో గాద్గదికమైంది. కళ్ళనీళ్ళు బొటబొటా కారాయి.

రాజు అతని దుఃఖం చూచి తెల్లబోయాడు. అయ్యో నిష్కారణంగా రమణ మనస్సు నొప్పించానే అని బాధపడ్డాడు. కాని జానకి వివాహం విషయం పూర్తిగా తెలుసుకోవలెననే వాంఛను మాత్రం వదలలేక పోయినాడు. నీవు పోరాడి కూడా జానకిని పెండ్లాడలేక పోయినావా? అవునులే మన దేశంలో వరకట్న దురాచార మొకటి కన్నెల పాలిటి ప్రబల శత్రువై బాధిస్తున్నదిగా. కట్నము లేకుండా మీ తల్లిదండ్రులు వివాహానికి అంగీకరించలేదు కాబోలు!

'మా అమ్మ దేమీలేదు'

మీ నాన్నగారే పట్టుపట్టారన్న మాట.

'పట్టేమిటి గావు పట్టు' మా మామయ్య పోయిన తరువాత వాళ్ల కాపురం బాగా చితికి పోయింది. అప్పులవాళ్ళు ఎగబడి ఉన్నది-మన్నది కట్టుకు పోయినారు. ఇల్లు గడవడమే కష్టమైపోయింది. జానకి పెళ్లెలా జరుగుతుంది. వారి పరిస్థితి యిట్లా ఉంటే అటు నేను ఎం బి బి. యస్. చదువుతున్నా నని, కొంచెమో గొప్పో ఆస్తిపాస్తి కలవాళ్ళమనీ నాకు సంబంధాల రావంధాళీ యెక్కువైంది. రోజు రోజుకూ నా కిస్తామంటున్న కట్నం అయిదువేలు పదివేలు, పదిహేనువేలు, యీవదాస్తీ అంటూ వేలంపాటలాగా పెరిగిపోవడం మొదలు పెట్టింది. మా నాన్న ఈ ద్రవ్య వ్యామోహంలో బాగా పడ్డాడు. ఈ కట్నం ఎంత ఎక్కువ పుచ్చుకుంటే అంత గొప్ప వాళ్ళమనీ అనుకున్నాడు. మనం ఎంత గొప్పవాళ్ళంకాకపోతే మనకింత రొక్కమిస్తామంటున్నారన్న గర్వంకూడా కలిగింది. ఏంజెప్పను మా కొంప సంతబజారై పోయింది. నేను సంత కోడెనైనాను వాళ్ళ తస్సాదియ్యా ఆ ఆడపిల్లల తండ్రులు మా నాన్నచుట్టూ తిరిగి ఆశ పుట్టించడమే కాకుండా రైలు చార్జీలు పెట్టుకొని విశాఖపట్నం దాకావచ్చి హాస్టలువద్దనో, కాలేజి గేటువద్దనో కాపలావేసి కూర్చుండేవాళ్ళు. నా చదువైనదాకా పెండ్లి చేసుకోననో, నాకు పరీక్షలు జరుగుతున్నాయి చూడటానికీ మాట్లాడటానికీ వీలుగాదనో ఏదో సాకులు చెప్పి ఎందరినో వెళ్ళగొట్టా. ఏంచేస్తేనేం తుదకు రిటైర్డు డి. యస్. పి. ఒకడు వచ్చి జిడ్డులాగా పట్టుకున్నాడు. ఒక్కతే కూతురుట, వరకట్నం ముందు ఇరవై వేలిస్తాడట

తరువాత యావదాస్తి నాదేనట. ఈ యెర వేశాడన్నాడు రమణ

'పోలీసు సూపరెంటెంటు చేసి బాగా దోచాడు కాబోలు' అన్నాడు రాజు నవ్వుతూ. ఆ డి. యస్. పి. ని చూసే నా కళ్ళు తిరిగిపోయినాయ్ ఇక ఆ కొమార్తె ఎట్లా ఉన్నదో? ఇక ఆయన నన్ను చూచిన క్షణమే మా నాన్న వద్దకు వెళ్ళి పెళ్ళి కరారు చేసుకొని మా నాన్న చేత ఉత్తరం వ్రాయించాడు. మానాన్న ఈ పెండ్లి నిశ్చయంవార్త తెలుపుతూ పెండ్లి పదిరోజులున్నది నీకు ఈ రోజుననే అయిదు వందలు టి. యమ్. ఓ. పంపుతున్నాను. దానితో నీకు కావలసిన సూట్లు ఉంగరం వాచి వగైరాలు కొనుక్కో-మని వ్రాశాడు. దానితోపాటు జానకికి వాళ్ళ ఊళ్ళోనే పెండ్లి నిశ్చయమైనదనీ, పెండ్లి మూడు రోజులున్నదనీ ఎవరో రెండో పెండ్లివాడి కిస్తున్నారనీ కూడా వ్రాశాడు. ఆ ఉత్తరం చూచి నే నెంత వేదనపొందానో, ఎంత దుఃఖించానో ఆ పరమాత్మునికె తెలుక. జానకి! చిన్నతనంనుంచి నాదే అనుకున్న జానకి! నన్ను చేసుకొనే తాహతు లేక ఏ ముసలి ముండాకొడుకునో చేసుకొని అఘోరిస్తుంటే నేను పోలీసు సూపరెంటెంటు కొమార్తెను చేసుకొని కులకడమూ, ఆ మాట తలచుకుంటే కాళ్లక్రింద కంప పెట్టినట్లయింది. గుండెల్లో మంట పెట్టినట్లయింది ఎంతసేపో కుమిలి కుమిలి ఏడ్చా. ఏమిటి కర్తవ్యమని ఆరోజల్లా కాలేజీకి పోకుండా కూర్చొని

ఆలోచించా. సమయానికి డబ్బుకూడా చేతి కందింది. ఎందుకైనా మంచిదని ఆ డబ్బు తీసుకున్నా. ఏమయినా సరే మానాన్న నన్ను ఏమి చేసినాసరే తక్షణం బయలుదేరి వెళ్ళి ఆ సుముహూర్తపు వేళకు నేనే జానకిని పెండ్లాడుదామనే వెఱ్ఱి నిశ్చయానికి వచ్చా. పెండ్లి ఎక్కడో తెలియదు. ఎప్పుడో తెలియదు. తక్షణమే స్టేషనుకు వచ్చి బాపట్లకు టిక్కెట్టు కొనుక్కొని మేలెక్కి కూర్చున్నా. మెయిల్ శర వేగంతో బయలుదేరి పోతున్నది. ఎన్నో స్టేషన్లు వస్తున్నాయి పోతున్నాయి. రాత్రి భోజనం వేళయింది. అన్నం నీళ్ళు ఆ గమనికే లేదు. బెజవాడలో ఓ అరగంట రెస్టు తీసుకుని మెయిల్ ట్రైన్ మళ్ళీ పరుగుసాగించింది. తెనాలి వచ్చింది. ఎవరో ఒకాయన నా పెట్టెలో కెక్కారు. కొంతసేపయిన తరువాత ఆయన "అబ్బాయి యెక్కడికెళుతున్నా"వన్నాడు. బాపట్లండీ అన్నా. బాపట్లలో ఎవరింటికన్నాడు. గోపాలకృష్ణ మూర్తిగారి యింటి కన్నాను. ఆయనిప్పుడు లేరుగా అన్నాడు. లేరు అన్నాను. రాత్రి వాళ్లమ్మాయి పెళ్ళయిందిగా, పెళ్ళ యిన తరువాత ఇప్పుడు వెళ్లుతున్నావేమిటి, పెళ్ళికేనా అన్నాడు. నేను నిలువునా నీరైపోయినా. కాసేపుదాకా నోట మాట రాలా. కాసేపు ఆగి మీకు సరిగా తెలుసునా అండీ పెళ్ళయినమాట నిజమేనా అన్నా "అయ్యో తెలియ కేమయ్యా! వట్టి పీనాశిముండాకొడుకు. ఉండటానికి బోలె డున్నది కాని కడుపునిండా అన్నము, వంటినిండా బట

మొగుడు ఇటువంటివాడిని చేసుకోడానికి ఆ అమ్మాయి ఎట్లా ఒప్పుకున్నదో అని ఊరందఱు ఒక్కటే ఆశ్చర్య పోతున్నారు. అయినా ఏమిజేస్తుంది. తండ్రిపోయినాడు. ఇంచీమంచీ చూచేదిక్కులేదు. పెళ్ళయ్యేదారి లేదు మేనత్త కొడుక్కు చేసుకోమన్నారట ఏమి చేస్తుంది ఈ బ్రహ్మానందం పాలపడ్డది. పదేళ్ళయింది ఈయన పెళ్ళాంపోయి. వంటచేసి పెట్టే ముసలమ్మ చచ్చిపోతే కాచిపోసే దిక్కులేక ఈ పెళ్లికి తలపడ్డాడుట అన్నాడాయన అప్పటి నా స్థితి చెప్పలేను. ఆ ఒక్కొక్క మాట వింటూఉంటే ఎవరో కూనీ చేయడానికి బల్లెంతో పొడుస్తున్నారా అనిపించింది. ఇంతకు జానకి దుర దృష్టవంతురాలు అటు తండ్రిని ఒప్పించి పెండ్లాడలేకపోయి నాను. ఇటు దొంగచాటుగా పెండ్లాడవలెనని సాహసించీ కృతార్థుడను కాలేకపోయినాను. ఇక అక్కడదాకా పోవడ మెందుకు. త్రోవలో ఏ స్టేషనులోనైనా రైలుదిగి వెనక్కు వెళ్ళిపోదామనుకున్నాను. కాని చిన్న స్టేషన్లలో మెయిలు ఆగదు గనుక విధిలేక బాపట్ల పోకతప్పలేదు. స్టేషనులో రైలు దిగానన్నమాటేగాని ఊళ్లోకి పోవడానికి బుద్ధి పుట్టలేదు. కనుక మద్రాసునుండి కలకత్తా మెయిలు వచ్చేవరకు స్టేషను లోనే ఉండి తిరిగి వైజాగ్ వచ్చాశా అన్నాడు. రమణారావు పుట్టెడు దుఃఖంతో కళ్ళుతుడుచుకుంటూ— రాజుకు కూడా కళ్ళ నీళ్ళు వచ్చాయి ఆ గాథవింటే.

సరే ఏమి చేస్తాము. నీ ప్రయత్నం నీవు చేశావు. దైవం అనుకూలించకపోతే ఏమి చేస్తావు. అయితే ఆ డి. యస్. పి.

సంబంధం ఏముంది! ఈ మాలతి వాళ్ళమ్మాయా ఏమి టన్నాడు రాజు.

ఛీ నీవింత తెలివితక్కువవాడ వనుకోలేదు రాజూ అన్నాడు రమణారావు.

నాకేదో అయోమయంగా ఉన్నదిరా బాబూ నీ గాథ' అన్నాడు రాజు.

'వైజాగ్ వచ్చానేకాని కాలేజీకి పోవడానికి బుద్ధి పుట్టలేదు. కాఫీ నీళ్ళయినా త్రాగాలనిపించలేదు. జానకికి చేసిన అపచారానికి పరిహారంగా ఏమి చేయను? అని ఆలోచిస్తూ రూములో పడుకున్నా. మనస్సు పరిపరివిధాల పోయింది. ప్రాణత్యాగం చేయవలెననికూడా బుద్ధి పుట్టింది. ఛీ ఇదిగాదు మార్గమనుకొని నా మంత్రానికి ఒక నిశ్చయానికి వచ్చి నా క్లాస్‌మేటూ, స్నేహితుడూ అయిన సూర్యారావు ఇంటి కెళ్లా. సూర్యారావు చాలా మంచివాడు. అతనికి తెలివితేట లున్నంతగా సిరిసంపదలు లేవు. మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. అతని చెల్లెలు మాలతి. స్కాలరుషిప్పులతోనే బియ్యేదాకా చదివి ఫస్టున ప్యాసైంది. ఆమెకు పెండ్లిచేసే శక్తిలేక తలిదండ్రులు అల్లాడిపోతున్నారు. వాళ్ల యింటికి వెళ్ళి సూర్యం మీ చెల్లెలిని పెండ్లాడవలెనని ఉన్నది. ఆవలెల్లుండి పెండ్లి, తంతేమీ లేదు, రిజిష్టర్ మ్యారేజీ జరగాలి. మీ తల్లి దండ్రులకు మీ చెల్లెలికి సమ్మతమేమో కనుక్కొని వచ్చి చెప్పు అని చెప్పి నా రూముకు వచ్చేశా. చదువుండి, చక్క

దనముండి, సంప్రదాయముండి. యోగ్యత ఉండి యీ వర కట్న దురాచారానికి బలై పోతున్న ఒక్క అభాగ్యకన్నైనా ఉద్ధరించి నా జీవితాన్ని సార్థకం చేసుకోవలెననే పట్టుదలతో ఇట్లా చేయడానికి సాహసించా. మరునాడుదయమే వచ్చి సూర్యారావు మావాళ్ళు అంగీకరించారోయి అని చెప్పాడు. అనుకున్న ప్రకారం రిజిస్ట్రారువారి సమక్షంలో ఉభయ పక్షాల సాక్షుల చేవ్రాలుతో మా వివాహం జరిగిపోయింది. వివాహం కాగానే, నా వివాహం జరిగిపోయింది మీ పెండ్లి ప్రయత్నాలు విరమించుకోండని మా నాన్నకు, డి యస్. పి. గారికి చెరో తంతి కొట్టాను. జానకికి కల్గిన ఆశాభంగానికి ఈ విధంగా పరిహారం చెల్లించి, ఒకవిధంగా తృప్తి పొందానే కాని ఆ అఘాతం అప్పటికి ఇప్పటికి మానని గాయంగానే ఉండి హృదయ వేదన కలిగిస్తూనే ఉన్నదన్నాడు రమణారావు.

'మరి మీనాన్నగారికి నీ పెండ్లి వార్త చాలా ఆగ్రహాన్ని, అవమానాన్ని కలిగించి వుండాలనే, దానికెట్లా తట్టుకున్నావు' అన్నాడు రాజు.

ఆc! చాలా ఆగ్రహమే కలిగించింది. ఇక నీ ముఖం చూడననీ, నా ఆస్తిలో ఒక్క పూరి పుడక నీకు చెందనీయననీ, చాలా కటువుగా నానా తిట్లూ తిట్టుతూ ఉత్తరం వ్రాశాడు. కాని యీ పరిస్థితి అనుకున్నదే గనుక ఏమీ అనుకోలేదు. కాని ఒక్కదానికి విచారించా. మా అమ్మ

అమాయకురాలు మహా సాధ్వి. నా పెండ్లిమాట విని మా నాన్న చేసిన ధూముధాములకు మా అమ్మ ఎంత బాధ పడి ఎంత క్షోభిల్లిపోయిందో అని చాలా బాధపడాను. ఏమయినా ఎంత కష్టమైనా జానకికి గల్గిన హృదయక్షోభ కంటె, దుఃఖంకంటె ఎక్కువై ఉండదుగా అని ఊరడిల్లా నన్నాడు రమణారావు

నిజమే. ఇక మీ నాన్నగారు డబ్బు పంపి ఉండరు గదా, పాపం ఫైనలియరెట్లా లాగేశావురా! ఇంత కటకట వస్తే నాకైనా ఉత్తరం వ్రాశావుగాదేమన్నాడు రాజు.

ఆ సప్త సముద్రాల అవతల వున్న నిన్నుకూడా ఏమి వేధించను? దానికి నీవంటి మిత్రుడొకడు తోడ్పడ్డాడు. దానికితోడుగా మాలతి తన కాలేజీలోనే ట్యూటరుగా చేరి కొంత సర్దుబాటు చేసింది అన్నాడు రమణారావు.

అయితే మీ అబ్బాయిని మీ అమ్మగారు, మీ నాన్నగారు ఇంతవరకు చూడలేదన్నమాట. అయితే శ్యాం నీవు పోయి మీ తాతగారిని బామ్మగారిని చేయిపట్టుకొని లాక్కురారా అని చెప్తూ ఉండు అన్నాడు రాజు.

నీవు చెప్పినదాకా ఆగలేదు. ఆ పని జరిగిపోయిందన్నాడు రమణారావు కొద్దిగా నవ్వుతూ.

అదెప్పుడు! అన్నాడు రాజు ఆశ్చర్యంగా.

నా వివాహ వార్తవిని మా నాన్న కోపంతో మండి పడుతూ నానా తిట్లు తిట్టుతూ ఉత్తరాలు వ్రాసినా నే నవేవీ పట్టించుకోకుండా మా క్షేమసమాచారాలు తెలుపుతూ విడవకుండా ఉత్తరాలు వ్రాస్తునే ఉన్నా. మనవడు పుట్టడం వాని శైశవ క్రీడలు, వాడి రూపు రేఖలు, వాడి ముద్దులు మురిపాలు తెలుపుతునే ఉన్నా. మా నాన్న కొన్నాళ్ళు నా ఉత్తరాలు చూడకుండానే బల్లమీద పారేశారట. తరువాత తరువాత తిన్నగా చదవడం ప్రారంభించారట. మనుమడి ముచ్చట్లు విని మురుచుకోడం మొదలుపెట్టారట. ఇంతలో పూర్తి పరివర్తనకు ఒక సంఘటన కారణమైంది. జానకి పెనిమిటి ఆమెకు కూడు గుడ్డ ఇవ్వకుండా అష్టకష్టాలు పెట్టి పుట్టింటికి పంపివేశాడనీ వాళ్ళు ఉన్నవూళ్ళో బతకలేక హైదరాబాదు చేరారని ఆయన చెవిని పడ్డది. ఇది ఆయనకెంతో మనస్తాప కారణమైంది. నే నెట్లాగూ కట్నం తీసుకొని పెండ్లి చేసుకోలేదు ఇందులకు మారుగా తాను సహృదయంతో జానకినే కోడలుగ చేసుకున్నట్లయితే ఆమెకిన్ని కష్టాలు వచ్చేవికావుగా అని ఆయన మనసులో వేదన ప్రారంభమైంది. అదే, కాకగా, దగ్గుగా, ఇంకా ఏవేవో బాధలుగా తయారైనాయి. మనిషి బాగా నీరసించి మంచమెక్కడం సంభవించింది. ఒకనాడు మా నాన్నకు జబ్బు ఎక్కువజేస్తే మా నాన్నకు చెప్పకుండానే మా తమ్ముడు నాకు వైర్ ఇచ్చాడు. ఆ టెలిగ్రాం చూచుకొని నేను తక్షణం సకుటుంబంగా

గుంటూరు వచ్చాను. మా నాన్న ఎదుట పడటమంటే నా గుండెలు దడదడ కొట్టుకోడం మొదలుపెట్టాయి. మా నాన్న గారు ఏమైనా కోపపడినా నీవు ఓర్పు వహించాలెనని మాలతితో ముందుగానే చెప్పి ఉంచా. నాకు తెలియదండీ అన్నది మాలతి. మేము వస్తామని ఇచ్చిన టెలిగ్రాం చూచు కొని మా తమ్ముడు రైలువద్దకు వచ్చాడు అందరం రిక్షాలు వేసుకొని ఇంటికి వచ్చాము. మా నాన్నకు ఉపచర్యలు చేస్తూ మా అమ్మ మా నాన్న మంచం వద్దనే ఉన్నది. మా నాన్న బాగా శుష్కించి పాలిపోయి కళాహీనమైన ముఖంతో కళ్ళుమూసుకొని మంచంమీద పడుకొని ఉన్నారు. మా తమ్ముడు మాకంటె ముందుగా రిక్షాదిగి శ్యాంను చంక పెట్టుకొని మా నాన్నవద్దకు వెళ్ళి నాన్నా! 'అన్నయ్య వచ్చాడు. ఇదుగో అన్నయ్య కొడు'కని పిల్లవాడిని చూపిం చాడు. పిల్లవాడు తాతగారిమీదికి దూకపోతున్నాడు. ఇంతలో నేను మాలతి వెళ్ళి మా నాన్నగారికి నమస్కరిం చాము మానాన్న ఏమీ మాట్లాడకుండా చూచి చూడ నట్టుగా ఊరుకొని మనుమణ్ణి ఆప్యాయంగా చూస్తూ ఉండి పోయినారు. పిమ్మట మా అమ్మకు గూడా నమస్కరించాము. మా అమ్మ మమ్ములను చూచి కళ్ళ నీళ్ళు పెట్టుకోడం మొదలుపెట్టింది. 'ఎందుకమ్మా ఏడ్వడం. నాన్నగారికి నయ మవుతుంది. ఆయనకు పెద్ద జబ్బేమీ లే'దన్నాను. అదేమి చిత్రమో మేము వెళ్ళిన మరుక్షణంనుంచి మా నాన్న జబ్బ

తిరుగుముఖం పట్టింది. క్రమంగా మాతో మాట్లాడటం మొదలు పెట్టారు. పొద్దస్తమానం బాబును తన పక్కలోనే కూర్చోపెట్టుకొని వానితో కాలక్షేపం చేయడం సాగించారు.

నేనుగూడ మా నాన్నగారికి అవసరమైన మందులు యింజక్షన్లూ క్రమంగా డాక్టరుతో చెప్పి యిప్పిస్తూ పథ్యపానాదులు జాగ్రత్తగా చూస్తూ వారివద్దనే ఉంటూ వచ్చాను. మాలతిగూడా పనిపాటలలో అత్తగారికి తోడ్పడ్డంలోను, మామగారికి కావలసిన ఉపచారాలు చేయడంలోను శ్రద్ధాభక్తులతో మెలగి అత్తమామల మనస్సు చూరగొన్నది. వారం రోజులున్నాము. మా యిద్దరికి సెలవులైపోయినాయి. జబ్బు కొంచెం ఉపశమించి మా నాన్న మంచంమీద లేచి కూర్చోడం మొదలుపెట్టారు. మేము వెళ్ళతామంటే ఆయనెంతో బాధపడ్డారు. ముఖ్యంగా మనుమణ్ణి వదలలేక ఆయన ఒకటే కళ్లనీళ్లు కార్చుకోడం చూస్తే జాలి వేసింది. మేము వచ్చేటప్పుడు కోడలికి చీరె రవికలు, మనుమడికి పట్టు చొక్కాలు యిచ్చి, పిల్లవాడికి మురుగులు, ఉంగరము, మొలత్రాడు చేయించమని ఆరు నవర్సుల బంగారం చేతిలోపెట్టి రైలు చార్జీలకు వేరే యాభై రూపాయలిచ్చి పంపలేక పంపలేక పంపించారు. నిజంగా మానాన్నలో యింత దయ, యింత ప్రేమ ఉన్నవని నేను కలలోనైనా ఊహించలేదన్నాడు రమణారావు.

. . .

'తలిదండ్రులకు కాకపోతే ఎవరికుంటుందిరా ప్రేమ! అది అవిచ్ఛిన్నమైన అమృత ధార. అది ఒకప్పుడు సన్నగిలినట్టు యింకిపోయినట్టు అనిపిస్తుందేగాని అది అంతర్వాహినిగా అవుతుందేగాని నశించదు. వారి ప్రేమే లేకపోతే మనం మనగలమా' అన్నాడు రాజు.

నిజమేరా, అప్పటినుండి మా రాకపోకలు యథాప్రకారంగా నడుస్తున్నాయి. మొన్న మా శ్యాం పుట్టినరోజుకు మా అమ్మా నాన్నా వచ్చి పదిరోజు లుండి పోయినారు. 'ఇక్కడ ఉండిపొండని నేను, మాలతి బలవంతం చేశాం గాని అవసరమైన పనులున్నవని వెళ్ళారు' అన్నాడు రమణారావు. 'అదృష్టవంతుడివిరా రమణా! ఇష్టమైన పెండ్లి చేసుకున్నావు. నాన్నగారి అనుగ్రహము సంపాదించా' వన్నాడు రాజు.

'అంతా భగవంతుని దయ' అన్నాడు రమణారావు

'అన్నీ బాగానే ఉన్నాయి. పాపం జానకిపనే అన్యాయమైపోయినది' అన్నాడు రాజు.

"అవును. ఇంతటి సంతోషంలోను నా హృదయాన్ని కాల్చివేస్తున్నదదే" అన్నాడు రమణారావు బాధతో.

"మరి నీవిక్కడెందుకున్నావు జానకి సహాయార్థమేనా!"

"అంతే లేకపోతే నాకీ ఊళ్ళో పనేమున్నది! జానక్కి కాపురం మూన్నాళ్ళ ముచ్చటైంది. ఎవరో స్వహాతురాలి

తెలుగు విశ్వవిద్యాలయం
గ్రంథాలయం

సహాయంతో హైదరాబాదులో ఒక చెట్టిగారి పిల్లలకు ట్యూషన్ చెప్పితే వాళ్ళు నెలకు నూరు రూపాయలిచ్చి ఉండటానికి ఇల్లిచ్చి ఎన్నోవిధాల కనిపెట్టి ఉండేవాళ్ళట. అట్లాగైనా జీవించకుండా ఆయన వెనుక ఉన్న శూలవ్యాధి ఏదో అకస్మాత్తుగా పైకివచ్చి గంటలమీద ప్రాణం తీసేసింది. ఈ సంగతి తంతిద్వారా ఆమెకు తెలియజేస్తే ఆమె తల్లి వచ్చారుట. ఏమున్నది శవం మాత్రమే కళ్లపడ్డది. ఈ విషయం నాకు ఆమె భర్త పోయిన మూడు వారాలకుగాని తెలియలేదు. ఆ వార్త విన్నతర్వాత నేను జానకిని చూడకుండా ఉండలేకపోయినాను జానకి నేనుగూడా వస్తానన్నది. సరే ఆరాత్రే బయలుదేరి వచ్చాం.

ఏమి చెప్పనాదృశ్యం: ఒంటిమీద చిన్నమెత్తు బంగారంలేదు. దుబ్బులాగా రేగిఉన్నతల, ముడిగుడ్డ, కన్నీళ్ళ చారికల కట్టిన ముఖము మూర్తీభవించిన శోకదేవతలాగా ఉన్నది. ఆమెను చూడటంతోనే పట్టరాని దుఃఖంవచ్చి నిలుచున్న చోటనే కూలబడిపోయినాను. ఏమిటి నాయనా! మగబిడ్డవు నీవేయింత బెంబేలుపడి యేడిస్తే జానకికి దిక్కెవ్వరు? విధిలో ఎట్లా ఉన్నదో అట్లా జరిగింది. నీవేమి చేస్తావు ఏడవవద్దని మా అత్తయ్య – అంటే జానకి తల్లి–ఓదార్చింది. రెండు రోజులైన తరువాత వెళ్ళుతామని చెప్తే 'బావా! నా కర్తవ్య మేమిటో చెప్పకుండా వెళ్ళుతావా?' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నది. 'జానకి! అయినదేమో

అయింది. విచారించి లాభంలేదు. నీ అభిప్రాయ మేమిటో చెప్తే ఆలోచిద్దా' మన్నాను.

'స్థిరచరాస్తి ఏమైతేనేమి ఇంచుమించు మూడు లక్ష లకు పైగా ఉన్నదని అంటున్నారు. ఆయన ఇంత సొమ్ము గడించారేగాని తాను తినలేదు, ఒకరికి పెట్టలేదు. చీమ కూడ బెట్టినట్టు కూడబెట్టి కావలివానివలె కావలి గాచి వెళ్ళిపోయి నాడు. ఇది నేనిప్పుడేమి చేయను. 'అన్నది'. నీవేది చేయ దలుచుకుంటే అదే చేయవచ్చును, అన్నా నేను.

జానకి కళ్లనిండా నీళ్ళు తెచ్చుకుని! బావా నా పెళ్లి సంగతి చూచావుగా. కట్నమిచ్చుకొనే శక్తిలేక ముసలి వాడిని కట్టుకొని యీ గతికి వచ్చాను. మధ్యకుటుంబాలలో పుట్టిన కన్నెలకు వరకట్నాలు పిచాచి పీడగా బాధిస్తున్నాయి. అనేకమంది కన్నెలు దీనికి బలైపోతున్నారు. లేదా అవివా హితులుగా ఉండిపోతున్నారు. ఈ రెండు స్త్రీలకు దుర్భర కష్టాలే, అన్నది జానకి.

'అవును ఇది దుర్భర కష్టంగానే ఉన్నది. దీనికి నివా రణమార్గమే కనిపించడంలేదు' అన్నాను నేను

'నివారణ మార్గం నాకొకటి కనిపిస్తున్నది ఈ ద్రవ్యంతో ఒక కన్యాశ్రమం పెట్టి వరకట్న మిచ్చుకోలేని మధ్య కుటుంబాలలోని కన్నెలకు వరకట్న నిషేధదీక్షితులైన

వరులనిచ్చి వివాహాలు చేయిద్దామని నా అభిప్రాయం' అన్నది జానకి.

"నీ ఆశయం చాలా బాగా ఉన్నది. కాని మనం ఆశ్రమం పెట్టినంతమాత్రాన్నె తల్లిదండ్రుల చాటున ఉండే ప్రాయంపు కన్నెలు వచ్చి మన ఆశ్రమంలో చేరుతారా? వాళ్లవాళ్లు అట్లా పంపటానికి ఒప్పుకుంటారా! అయినా పెళ్ళంటూ ఇక్కడ వూరికె వచ్చి కూర్చుంటే వాళ్ళకేమి తోస్తుంది.

"వాళ్ళు ఊరికే ఉండకుండా మేష్టర్లను పెట్టి వాళ్ళ కిష్టమైన చదువో, సంగీతమో చెప్పించి ప్రైవేటు పరీక్షలకు పంపవచ్చును. వారికి తగిన సంబంధాలు వచ్చినప్పుడు వివాహాలు చేయవచ్చును. ఈ ఆస్తి ఎవరి స్వార్జితమో వారిపేర ఈ కన్యాశ్రమం పెట్టవచ్చును"

జానకి ఉదారాశయాలకు సత్సంకల్పానికి నేను ముగ్ధుడనై పోయినాను. జానకీ! నీ తలంపు చాలా ఉత్తమంగా ఉన్నది. ఇది కన్నెలకు మహోపకారంగా ఉంటుంది. నీకు సత్కాలక్షేపంగాను మనశ్శాంతికరంగాను ఉంటుంది అన్నాను నేను.

అయితే బావా నాదొక్క ప్రార్థన.

ఏమిటమ్మా?

ఇదొక మహాప్రయత్నం, నేను పడిన కష్టాన్నిబట్టి కన్నెల కిట్టి సహాయంచేస్తే బాగా ఉంటుందనుకొన్నానే గాని దీనిని నిర్వహించడం సామాన్యమైన పనిగాదు. నీవు మా చెల్లెలు సంపూర్ణంగా సహకరించాలె' అన్నది జానకి. వెంటనే మాలతి అందుకొని "అక్కా! ఈ మహాకార్యంలో నీవేమి చేయమంటే అది చేయడానికి నేను సిద్ధము అన్నది. మీరుభయులు ఇంత గొప్పపని చేస్తూఉంటే నే నేనా వెనుదీసేది. నేను మీతోబాటు సేవకు సిద్ధమే' అన్నాను. జానకి చాలా సంతోషించి 'అయితే మీరిక్కడ ఉండిపోండి' అన్నది.

'నిజంగా జానకికి ఎంతమంచి ఊహతట్టిందిరా. డబ్బు వేలాది మందికి ఉంటుంది. దాని వినియోగం వేయింటి కొక్కరికైనా తెలియదు అన్నాడు' రాజు. మూడు నెలలో బ్రహ్మానంద కన్యాశ్రమం వెలిసింది. రాజూ నిజంగా మనము ఒక సత్కార్యానికి పూనుకోవాలేగాని భగవంతుడు వేయి చేతులతో చేయూతనిచ్చి వేయికండ్లతో కాపాడి వేయి విధాల వృద్ధిలోకి తెస్తాడు. కన్నెలను చేర్చడం కష్టమను కున్నాం. బిలబిల లాడుతూ అనేకమంది కన్నెలువచ్చి ఆశ్రమంలో చేరారు. వీరిని పెండ్లాడేందుకు వరులు ముందుకు వస్తారా అనుకున్నాను. ఏందఱో యువకులు పెండ్లాడటానికి వస్తున్నారు. యువకులలో త్యాగశీలత లోపించలేదు. ఉత్సాహం కొఱవడలేదు: సాంఘిక దురాచార నిర్మూలనా శ

లేకపోలేదు వరకట్నాలు స్వీకరించడంలోని నైచ్యాన్ని గుర్తించక పోలేదు. పరిసరముల ప్రభావం, తల్లిదండ్రుల ఒత్తిడి, స్వాతంత్ర్య విహీనత, కట్నం కానుకలపై గల చిన్న తనపు సరదా, ఎంత ఎక్కువ కట్నం పుచ్చుకుంటే అంత గొప్పవాళ్ళమను భ్రాంతి వాళ్ళను తప్పుదారి పట్టిస్తున్నది. అయినప్పటికి ఎంతమందో యువకులు కన్యాశ్రమం కన్నెలను పెండ్లాడటానికి ఉత్సాహంతో వస్తున్నారు. ఎంతమందో కన్నెల తండ్రులు 'మా అమ్మాయిలను మీ ఆశ్రమానికి పంపుతాం. పెండ్లిచేయండి లేదా వరులను కుదిర్చి మాకు పంపండి. యథాశక్తిగా సాలంకృత కన్యాదానంచేసి కృతార్థుల మౌతామని వ్రాస్తున్నారు. ఈ కన్యాశ్రమంవల్ల చదువు చక్కదనం, సౌశీల్యము, అభిజాత్యముగల పేదకన్నెలు ఏ కొందరైనా తగిన భర్తలను బడసి సుఖింప గలిగితే తన జన్మ సార్థకమైనట్లే అనుకుంటున్నది జానకి. నిజంగా ఆమె జన్మ సార్థక మవుతున్నది. ఆ పిల్లలెంత మంచివాళ్ళు! చక్కగా చెప్పినట్టు నడుచుకుంటున్నారు. చదువు కుంటున్నారు. వాళ్ళనుచూస్తే ముచ్చట వేస్తూఉంటుంది. జానకిని అమ్మా అంటారు. మాలతిని పిన్నీ అంటారు. నన్ను బాబాయి అం టారు. మాదో విచిత్ర కుటుంబం' అన్నాడు రమణారావు.

మీ కుటుంబ గాథ వింటూ ఉంటే నిజంగా విచిత్రం గానే ఉన్నది. మీరేదో దేవతా మనుషుల్లాగున్నారు. అయితే యిప్పటికెన్ని కన్యాదానాలు చేశావన్నాడు రాజు నవ్వుతూ.

ఇప్పటికి ఇరవై నాలుగైనాయి. ఇంకొక్కటి జరిగితే మా కల్యాణ మండపానికి రజతోత్సవమే చేయవచ్చు నన్నాడు రమణారావు ఉత్సాహంగా.

అయితే మీ కన్యాశ్రమంలో నాకొక కన్నెనిప్పించు ఆ రజతోత్సవ కల్యాణ గౌరవం నాకు దక్కుతుందన్నాడు రాజు.

నిజమా హాస్యమా! అబ్బో మీవాళ్ళు ఒప్పుకుంటారూ అన్నాడు రమణ.

మీవాళ్ళు ఒప్పుకున్నారూ. అన్నాడు రాజు నవ్వుతూ.

"నీకు మేనగోడలున్నదిగా. నీవు ఫారన్‌నుంచి రాగానే ముడి పెట్టెయ్యాలని మీ అక్కయ్య బావ ఎదురు చూస్తు న్నారుగా" అన్నాడు రమణ.

చూస్తున్నమాట నిజమేగాని అక్కకూతుర్ని చేసుకో వాలెనని నాకెప్పుడూ లేదు. అది తప్పనికూడా నా అభి ప్రాయం కనుక నీ కిష్టమైతే మంచి కన్నెను చూడు.

"నాకిష్టం లేకపోవడమేమిటి? మీవంటి వరులు దొరి కితే మూడు ముళ్ళు వేయించడానికేగా ముడివేసుక కూర్చున్నా" మన్నాడు రమణారావు.

'సరే! రైటు. ఇంతకు నీ చదివిన చదువంతా ఏమి చేశావు? కన్యాశ్రమ నిర్వాహణమేనా వేరే వృత్తి వున్నదా?

'లేకేమి. మా ఇంటిపక్కనే ఉన్న పర్ణకుటీరమే మా వైద్యశాల. పేదవాళ్ళ డాక్టరునని పేరు పడ్డది. వాళ్ళే వస్తూ ఉంటారు. పాపము డబ్బు ఇవ్వలేకపోతే మంచిమందు ఇవ్వమని వాళ్ళకు భయం కాన యథాశక్తిగా ఇస్తూ ఉంటారు. కుటుంబం సుఖంగానే గడచిపోతున్నది' అన్నాడు రమణ

'సరే! నేను చెప్పిన విషయం ఆలోచించు' అన్నాడు రాజు.

'ఓ తప్పకుండా ఆలోచిస్తాం. నీవంటి సంపన్న కుటుంబీకుడు ఉన్నత విద్యావంతుడు అయిన యువకుడు కన్యాశ్రమం బాలికను వివాహమాడతానంటే అంతకంటే సంతోషకరమైన విషయ మున్నదా' అన్నాడు రమణారావు రాజు వీపు తట్టుతూ ఉత్సాహంతో.

* * *

స్టేషనులో లైట్లన్నీ ఒక్కమాటు గుప్పున వెలిగాయి. సమీప రైలుకట్ట పరిసరంగూడా తెల్లని విద్యుత్కాంతులతో పట్టపగలులాగా అయిపోయింది. తోడనే జనతా ఎక్స్‌ప్రెస్ బోయ్‌మని బూకరించుకుంటూ స్టేషనులోకి వస్తున్నది. ఇదేమిట్రోయ్ ఎనిమిదైనట్టున్నదంటూ మిత్రు లిద్దరూ చివ్వున లేచి ఇంటివోవ పట్టారు.

మరునాడు రాజు అభిప్రాయం జానకికి తెలియజేయబడింది. జానకి చాలా సంతోషించింది. హైమవతి చక్కని చుక్క. ఇంటరు ప్యాసైంది. మంచి యోగ్యురాలు, మంచి కుటుంబానికి చెందినది. వధూ వరులు ఒకరి నొకరు చూసుకొని సమ్మతించారు. సమ్మతించినదే తడవు వివాహం ఏర్పాట్లు జరిగిపోయినాయి.

మంగళ తూర్యారవములు చెలంగుచుండగా కన్యాశ్రమం కల్యాణ మండపంలో హైమవతీ రాజేశ్వరుల వివాహం వైభవంగా జరిగిపోయింది. తన వివాహ సందర్భంలో కన్యాశ్రమానికి వేయినూటపదార్లు విరాళ మిచ్చాడు రాజు.